క్లుప్తంగా

వేళంగి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



వేళంగి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్

కరప: వేళంగిలోని పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యచంద్రతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష జరిపి, పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో సిబ్బందితో పాటు, వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల నిర్వహణపై నరసింహనాయక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యులు ఆర్.శ్రీనివాస్‌నాయక్, అనూష, ఎంపీహెచ్ ఈఓ గోవింద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని టార్గెట్ చేయడం దారుణం

వైఎస్సార్ సీపీ మహిళా నేత నాగమణి



కాకినాడ రూరల్: అసెంబ్లీ సమావేశాల్లో సినీనటుడు చిరంజీవిని టార్గెట్ చేస్తూ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడడం దారుణమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అన్నారు. శుక్రవారం కాకినాడ కొత్త గైగోలుపాడులోని ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ డైవర్షన్ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, దీనికి సరైన సమాధానం చెబుతారని అన్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాటలే ఇందుకు ఉదాహరణ అన్నారు. వైద్య కళాశాలలకు సంబంధించి ఎన్నేళ్లకు పీపీపీ విధానమని శాసన మండలి చైర్మన్ ప్రశ్నిస్తే, ఆరోగ్యశాఖ మంత్రి నేరుగా 66 అని చెప్పకుండా, 33 ప్లస్ 33 అని బదులిచ్చారన్నారు. ఈ విషయం బయటకు వస్తే ఆందోళన జరుగుతుందని డైవర్షన్ రాజకీయాలను ప్రారంభించారని విమర్శించారు. అప్పుడు అసెంబ్లీలో చిరంజీవి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలను టార్గెట్ చేస్తూ ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడారని, ఇలా మొత్తం టాపిక్ డైవర్షన్ చేశారన్నారు.

నేడు దసరా నృత్య మహోత్సవం

బోట్‌క్లబ్: నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ దసరా నృత్య మహోత్సవం శక్తి పురస్కార్ 2025 ప్రదానోత్స కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హరిగురు శరవణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు రాజా ట్యాంకు పార్కులో ఉన్న గోదావరి కళాక్షేత్రంలో నిర్వహిస్తామన్నారు. దీనికి ముఖ్య అతిథిగా కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రామలింగశాస్త్రి హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రామలింగ శాస్త్రికి, వసంత కిరణ్‌లకు శక్తి పురస్కారం అందిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు.

వచ్చే నెలాఖరులో నాటిక పోటీలు



నాటిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వచ్చే నెల 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకూ నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్వీ రంగారావు కళాస్రవంతి ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు తెలిపారు. నాటిక పోటీల బ్రోచర్‌ను శుక్రవారం సలాది రమేష్ ఆవిష్కరించారు. అక్టోబర్ 31న ఎస్వీ రంగారావు కళాస్రవంతి సర్వసభ్య సమావేశం, నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నాన్న, కన్యాపహరణం, తితీక్ష నాటిక ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు. నవంబర్ 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు సాహితీ సూత్రం, ఆవిధంగా, చౌకీదార్ నాటికలు ప్రదర్శిస్తామన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పీజే చంటిరెడ్డి, గౌరవాధ్యక్షుడు పేపకాయల రామకృష్ణ, అచ్చంపేట సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వీరన్న దంపతులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరన్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవ్వడంతో ఈ సత్కారం జరిగింది.

ఉక్కు తుక్కు అవుతున్నా..

- కేసులు తేలవు, వాహనాలు కదలవు
- పోలీస్ స్టేషన్ల వద్ద పాడవుతున్న వైనం



రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఎండలో వాహనాలు



ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో తుప్పపట్టిన మోటారు సైకిళ్లు

కాకినాడ లీగల్: వాహనాలకు తుప్పు పడుతున్నాయి.. ఏళ్లకు ఏళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి.. చివరికి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.. కనీసం షెడ్లు లేక పాడైపోతున్నాయి.. కాకినాడ నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల వద్ద వాహనాల పరిస్థితి ఇది.. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఆయా స్టేషన్ల ఆవరణలో నిలిపి ఉంచుతున్నారు. చోరీ, హత్య, గంజాయి రవాణా, ఇతర కేసులకు సంబంధించిన నిందితుల వద్ద నుంచి వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్లలో పెడుతున్నారు. ఇలా కాకినాడ ఒకటో, రెండో, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ల వద్ద, ఇంద్రపాలెం, సర్పవరం, పోర్ట్ పోలీస్ స్టేషన్లలో వాహనాలు పేరుకుపోయాయి. ఈ వాహనాలకు షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండి, వర్షాలకు తడుస్తున్నాయి. ఫలితంగా ఈ వాహనాలు ఎందుకూ పనికిరాకుండా మారుతున్నాయని పలువురు అంటున్నారు. ఇలా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో స్టేషన్ ఆవరణలు నిండిపోయాయి. వాహనాలు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. ప్రమాదానికి గురైన వాహనాలు, దొంగల నుంచి పట్టుకున్న వాహనాలు ఇక్కడ పాడై మరింత అధ్వానంగా ఉన్నాయి. ఇలా ఏళ్ల తరబడి ఉండిపోవడంతో కనీసం కదలలేని స్థితికి చేరాయి. వివిధ కోర్టుల్లో ఈ వాహనాలకు సంబంధించిన కేసులు తేలకపోవడం వల్లే వీటికి మోక్షం కలగడం లేదని పలువురు అంటున్నారు. గత ప్రభుత్వంలో కోర్టులో కేసులు పూర్తయిన తరువాత వాటికి సంబంధించిన వాహన యజమానులు తీసుకెళ్లకపోతే వేలం వేసేవారు. ఇలా వచ్చిన సొమ్ము ప్రభుత్వం ఖజానాకు చేరేది. కోర్టు కేసుల్లో పెండింగ్ ఉన్న వాహనాలు సామాన్య ప్రజలకు పోలీసులు ఇవ్వడానికి నిబంధనలు చెబుతున్నారు. అదే ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సు ఉంటే ఆ నిబంధనలు పక్కన పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఈ నిబంధనలు ఎందుకో..

నిందితుడికి ఏడేళ్ల లోపు శిక్షలు పడే కేసుల్లో పోలీస్ స్టేషన్ ద్వారా బెయిల్‌కు ఇద్దరు వ్యక్తుల జామీను తీసుకుని నిందితుడిని విడుదల చేస్తున్నారు. అయితే ఆ కేసుల్లో వాహనాలు ఇవ్వాలంటే కోర్టు ద్వారా తీసుకోమంటున్నారు. వాహనాల చోరీ కేసుల్లో నిందితుడిని బెయిల్‌పై విడుదల చేస్తున్నారు. అయితే ఆ వాహన యజమానికి వాహనం ఇవ్వడానికి నిబంధనలు ఎందుకు పెడుతున్నారని పలువురు అంటున్నారు. కేసులు పూర్తయిన వాహనాలను తీసుకెళ్లపోతే, వాటిని గుర్తించి గతంలో మాదిరిగా ఆక్షన్ పెట్టి విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మూడో పట్టణ స్టేషన్ ఆవరణలో..

వాహనాలకు రక్షణ కల్పించండి



పోలీస్ స్టేషన్ల వద్ద వాహనాలు నిలిపేందుకు షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి తడిచి ఎందుకూ పనికిరాని విధంగా ఉంటున్నాయి. కేసులు పూర్తయ్యే సమయానికి వాహనాలు తుప్పుపట్టి పాడవుతున్నాయి. ఇలాంటి సమస్య లేకుండా షెడ్లు నిర్మించాలి. వీటిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– వి.శ్రీనివాస్, న్యాయవాది, కాకినాడ బార్ అసోసియేషన్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కూరాడలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కరప: మహిళల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, వారికి తగిన వైద్య సేవలందించేందుకు నిర్వహిస్తున్న స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభయాన్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వెలుగుబంట్ల సూరిబాబు కోరారు. కూరాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యులు ఎం.అనూష, సింధు, పీవీ రమణమూర్తి తదితర వైద్య సిబ్బందితో కలసి మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. గుత్తుల బాలాజీ, వెలుగుబంట్ల గంగాధర్, వి.శ్రీనివాస్, పి.హరిబాబు, టి.సాయిరాం, చోడిశెట్టి ప్రసాద్, తలాటం సతీష్ తదితరులు పాల్గొన్నారు. పెనుగుదురులో నిర్వహించిన వైద్య శిబిరంలో మహిళలకు వైద్యులు వి.ఎం జలిన్, అఫ్రోజ్ పరీక్షలు నిర్వహించారు. బీజేపీ నాయకులు తుమ్మలపల్లి నానీ, పుట్టా వీరప్రసాద్‌గాంధీ, ముమ్మిడి పెద్దకాపు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తిరూపిణీ... శరణు శరణు

- కిటకిటలాడిన దుర్గాదేవి ఆలయాలు
- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు



కరప శివాలయంలో పర్వతవర్ధినీదేవి



నడకుదురులో దుర్గాదేవి అమ్మవారు



రమణయ్యపేట శ్రీపీఠంలో శ్రీదుర్గాదేవిగా ఐశ్వర్యాంబిక



రమణయ్యపేట హ్రీం పీఠంలో వనదుర్గగా..



భానులింగేశ్వరుని ఆలయంలో మహాలక్ష్మీదేవిగా..



సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి ఆలయంలో..



దేవాలయం వీధిలో రాజరాజేశ్వరీదేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు

కరప: శక్తి రూపిణీ.. శరణు శరణు అంటూ ఆ దుర్గామాతను భక్తులు కొలిచారు. శరన్నవరాత్ర ఉత్సవాలు, ఆపై శుక్రవారం కావడంతో దుర్గాదేవి ఆలయాలు కిటకిటలాడాయి. ఉత్సవాల్లో ఐదో రోజు కరప శివాలయంలో పర్వతవర్ధినీదేవి మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ కె.తిరుమల రవితేజ, సీహెచ్ శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు తరలివచ్చి కుంకుమ పూజలు చేయించుకున్నారు. అర్చకుడు కొంపెల్ల చక్రధర్ పూజలు చేశారు. చింతపల్లి రోడ్డులో అర్చకులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠలు విజయ దుర్గాదేవి అమ్మవారికి పూజాదికాలు నిర్వహించగా, విజయ దుర్గా ఆటో యూనియన్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి, ప్రసాద వితరణ చేశారు.

అమ్మవారికి సారె సమర్పణ

నడకుదురులోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. గ్రామంలోని గుల్లిపల్లివారి వీధి మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు, వివిధ రకాల పిండి వంటలతో దుర్గాదేవి ఆలయానికి ఊరేగింపుగా వచ్చి సమర్పించారు. మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గుల్లిపల్లి మాధవ్, చీపురపల్లి రాము, గుల్లిపల్లి దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, వీర రాఘవులు తదితర గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: గ్రామాల్లో దసరా వేడుకల సందడి కొనసాగుతోంది. ఐదు రోజులుగా అమ్మవార్లు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రమణయ్యపేట హ్రీం పీఠంలో శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారు వనదుర్గగా అలంకృతులయ్యారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. రమణయ్యపేట శేషాద్రినగర్‌లో బాల కనకదుర్గమ్మ ఆలయంలో కమిటీ చైర్మన్ లింగం రవి ఆధ్వర్యంలో దీపార్చన, విశేష పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో భక్తుల కిటకిట

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయిబాబా భజన మండలివారి భజన, అనంతరం గాయత్రి గానలహరి విద్యార్థుల భక్తి కీర్తనలు ఆకట్టుకున్నాయి. దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేశారు. మాధవనగర్‌లోని కనకదుర్గమ్మ వారిని కూష్మాండ దూపంలో అలంకరించారు. ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సంతచెరువు కనకదుర్గమ్మ ఆలయం, రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



నడకుదురులో అమ్మవారి సారెతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మహిళల కుంకుమ పూజలు

గ్రామాలు సుస్థిరాభివృద్ధి సాధించాలి



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: గ్రామాలు ఆదాయ వనరులను పెంచుకుని సుస్థిరాభివృద్ధి సాధించాలని, దీనికి సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో సాగాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే నిధులపైనే ఆధారపడకుండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఆలోచన చేయాలన్నారు. వినూత్న ప్రాజెక్టుల ఏర్పాటుకు నిధుల సమీకరణ మార్గాలు అన్వేషించాలన్నారు. శిక్షణ పొందిన గ్రామ కార్యదర్శులు శివరామ్, వీరబాబు, పీఎస్ బ్రహ్మానందం, పి.ఉమామహేశ్వరిలు సొంత ఆదాయ మార్గాలు పెంచుకునే వ్యూహాలు, పన్ను వసూళ్లలో అనుసరించాల్సిన వ్యక్తిగత ప్రవర్తనావళి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏఓ బీఎల్ నరసింహం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సంఘ సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘ జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు

బోట్‌క్లబ్: రాష్ట్రంలో రజకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం రజక వృత్తిదారుల సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో రజకులపై అనేక రకాల దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చట్టం ఏర్పాటు చేయాలని రాజు డిమాండ్ చేశారు. రజకుల ఆస్తులు, ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడిందని, వాటిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు దోబీ ఘాట్లు నిర్మించి ఉచితంగా విద్యుత్ సరఫరా ఇవ్వాలన్నారు. ఈ వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానన్న ప్రభుత్వ హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు వానపల్లి గంగాధరం, పేట అప్పారావు, పోలిపల్లి శ్రీను, మద్ది కనకరాజు, బాబూరావు, శోభన్‌బాబు, నాగేష్, నాగేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కొండెల్లి పేటకు చెందిన చిట్టెమ్మకు నిత్యావసర సరకులు అందజేశారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ క్లబ్ సభ్యుడు కిరణ్‌కుమార్ స్నేహితుడు ఫ్రెడ్రిక్ పుట్టినరోజు సందర్భంగా నెలకు సరిపడా నిత్యావసరాలు సమకూర్చడం సంతోషంగా ఉందన్నారు. క్లబ్ జోన్ చైర్మన్ బాలాత్రిపుర సుందరి, దుర్గాప్రసాద్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం కాదు... పనులు చేయండి



సమావేశంలో అధికారుల తీరును తప్పుపడుతున్న వైస్ చైర్మన్, సభ్యులు



సభ్యులకు సమాధానం ఇస్తున్న కమిషనర్, చైర్ పర్సన్లు

- పట్టణంలో పారిశుధ్యం అధ్వానం
- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- సామర్లకోటలో వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: స్వచ్ఛ సామర్లకోట – పరిసరాల పరిశుభ్రత అని ప్రచారం మాత్రం గొప్పగా చేస్తున్నారని, ముందు పారిశుధ్య పనులు పక్కా చేపట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. దీనికి ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన వహించారు. పట్టణంలో సమస్యలపై చర్చించడానికి జీరో అవర్‌లో అవకాశం ఇవ్వాలని కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ పట్టుపట్టారు. నెలకోసారి జరిగే కౌన్సిల్ సమావేశానికి అటెండర్లు హాజరు కాకపోవడం, మైక్‌లు పనిచేయక పోవడంపై వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ శాఖలో పనిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నెలలో జనరేటర్ పనిచేయక సభ్యులంతా అసహనం వ్యక్తం చేసినా అధికారులకు చీమకుట్టినట్లు లేదని రెడ్నం సునీత ఆరోపించారు. పట్టణ ప్రధాన రోడ్డులో డివైడర్ల వెంబడి ఎర్ర మట్టి పేరుకుపోవడంతో చిన్న వాహనచోదకులు, నడిచి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాజ్‌కుమార్ అన్నారు. పారిశుధ్య వాహనాలు తరచూ ఎందుకు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రశ్నించారు. డివైడర్ల వద్ద మట్టిని తొలగించడంతో పాటు, సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న అనేక మంది మస్తర్లు వేయించుకుని, వేరొకరితో పనులు చేయిస్తున్నారని కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. ఇప్పటివరకూ తమ వార్డులో ఒక పని కూడా చేయలేదని 8వ వార్డు కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వర్టు, డ్రైన్ పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఏఈ నరసింహారావు తెలిపారు. గ్యాస్ పైపులైన్ పేరుతో ఎనిమిదేళ్ల కిందట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సత్యనారాయణపురం వెళ్లే రోడ్డును తవ్వేశారని, దాంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ సేపెని సురేష్ అన్నారు. అక్కడ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. సత్యనారాయణపురంలో గ్యాస్ పైపులైన్ పాయింట్ ఇళ్ల మధ్య ఏర్పాటు చేయడం సరికాదని, దానిని మార్పు చేయాలని వైస్ చైర్మన్ మోజెస్ సూచించారు.

ఇంజినీరింగ్ శాఖ తీరు దారుణం

మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ శాఖ అధికారుల పనితీరు దారుణంగా ఉందని కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, కరణం రాజ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో స్థలం లేకుండా మరుగుదొడ్లు ఎక్కడ నిర్మిస్తారని, ఆ అంశంపై ఏవిధంగా ఆమోదం తెలపాలని సభ్యులు ప్రశ్నించారు. కార్తిక మాసంలో భక్తులు స్నానాలు చేయడానికి సదుపాయాల కోసం రూ.4.20 లక్షలు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదాయం ఆలయానికి వస్తుందని, ఈ మేరకు దేవదాయ శాఖ భక్తులకు సౌకర్యాలు కల్పించాలని పిట్టా సత్యనారాయణ అన్నారు. 2000 సంవత్సరంలో ఫిల్టర్ ప్లాంటు ఏర్పాటు చేయగా అప్పటి నుంచి మరుగుదొడ్లు ఏర్పాటు చేయక పోగా, నలుగురు సిబ్బంది కోసం రూ.ఐదు లక్షలతో మరుగుదొడ్లకు ఇంజినీరింగ్ శాఖ నిధులు కేటాయించడం వింతగా ఉందని సభ్యులు ఆరోపించారు. ఇళ్లకు డిజిటల్ బోర్డుల ఏర్పాటుకు రూ.7.50 లక్షలు కేటాయించడం దారుణమని సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో అజెండాలోని డిజిటల్ బోర్డులకు సంబంధించిన 46వ అంశాన్ని రద్దు చేయాలని, మరో మూడు అంశాలను వాయిదా వేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. డీఈ కె.శశిధర్, ఆర్వో సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ రంగంలో ఉద్యోగావకాశాలు

బోట్‌క్లబ్: బ్యూటీషియన్ రంగంలో ఇతర దేశాల్లో సైతం మంచి ఉద్యోగాలు సాధించవచ్చని ఐబీహెచ్ఎస్ నిర్వాహకులు మెట్టా రాధాసరస్వతీ, అప్పసాని కృష్ణకుమారి అన్నారు. భానుగుడిలో తమ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత శిక్షణ పొందిన వారికి శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తమ సంస్థ స్థాపించినప్పటి నుంచి విద్యార్థులకు ప్రాక్టికల్, థియరీ శిక్షణ అందించి వారు శిక్షణ పొందిన అనంతరం ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.